సింహాద్రి ఎన్టీపీసీతో విద్యార్థులకు యోగం

- ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో యోగాలో శిక్షణ
- మండలంలోని జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులకు ప్రత్యేకం
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

పరవాడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు యోగా పోటీల్లో సత్తా చాటుతున్నారు. ఇందుకు సింహాద్రి ఎన్టీపీసీ ప్రధాన భూమిక పోషిస్తోంది. సంస్థ సీఎస్సార్ నిధులు, యోగా శిక్షకుడు సీహెచ్ ఆంజనేయులు పర్యవేక్షణలో విద్యార్థులు అకుంఠిత దీక్షతో యోగాలో రాటుదేలుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించడమే లక్ష్యంగా కఠోర సాధన చేస్తూ సహకరిస్తున్న సంస్థకు, శిక్షణ అందిస్తున్న గురువులకు, తల్లిదండ్రులకు పేరు తీసుకొస్తున్నారు. **– పరవాడ**



యోగాసనాల్లో విద్యార్థినులు

పదేళ్లుగా సింహాద్రి ఎన్టీపీసీ కృషి

ఎన్టీపీసీ తన సీఎస్సార్ నిధులతో పదేళ్లుగా పరవాడ మండలంలో అన్ని జిల్లా పరిషత్ పాఠశాలల్లో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. వీరికి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక నిపుణుల్ని నియమించడంతోపాటు అవసరమైన యోగా మ్యాట్‌లు, ఆర్థిక సహకారం అందిస్తోంది. ఇప్పటి వరకు 36 మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకాలు సాధించి సత్తా చాటారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించి, మండలంలోని ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు సింహాద్రి ఎన్టీపీసీ కృషి చేస్తోంది.



విభక్త విపరీత శలభాసనంలో యశస్విని

ఖేలో ఇండియాలో పాల్గొంటా

మాది నాయుడుపాలెం. నా తండ్రి దేముడు ఫార్మాసిటీలో లేబర్ వర్కర్. తల్లి రాజేశ్వరి కూలి పనులకు వెళ్తుంటారు. మూడేళ్లుగా ఎన్టీపీసీ అందిస్తున్న యోగాలో శిక్షణ పొందుతున్నాను. అనకాపల్లిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకం గెలిచి, అనంతపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాను. ఇక్కడ పతకం సాధించి, జాతీయ స్థాయి, ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొనే దిశగా రోజూ సాధన చేస్తున్నా. **– బి.యశస్విని, జెడ్పీ హైస్కూల్, మెట్టపాలెం**

రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్యం



పార్శ్వ పాశాసనంలో పవన్‌కుమార్

మాది కొంకోట మండలం అచ్చెర్ల. మా తండ్రి నాగరాజు రోజు కూలీ. ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్నా. నాలుగేళ్లుగా ఎన్టీపీసీ నియమించిన యోగా గురువు వద్ద యోగా శిక్షణ పొందుతున్నా. రోజూ రెండు మూడు గంటల పాటు యోగా సాధన చేస్తా. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించా. తాడేపల్లి గూడెంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొని కాంస్య పతకం గెలుపొందా. **– ఒ.పవన్‌కుమార్, జెడ్పీ హైస్కూల్, లంకెపాలెం**

వంద ఆసనాలు వేస్తా



ద్విపాద శిరాసనంలో అభిరామ్



నేను 10 తరగతి చదువుతున్నాను. తండ్రి శ్రీను టైలర్. తల్లి లక్ష్మి బ్రాండెక్సు పరిశ్రమలో పనిచేస్తుంది. కోచ్ ఆంజనేయులు వద్ద ఐదేళ్ల నుంచి శిక్షణ పొందుతున్నా. రోజూ ఉదయం, సాయంత్రం సాధన చేస్తూ వంద ఆసనాలు నేర్చుకున్నా. ఇటీవల తాడేపల్లిగూడెంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలు, గతంలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించాను. జాతీయ స్థాయి పోటీల్లో రాణించడమే నా లక్ష్యం. **– ఎస్.అభిరామ్, జెడ్పీ హైస్కూల్, వాడచీపురుపల్లి**



ఏకపాద రాజకపోతాసనంలో తేజ

జాతీయ పోటీలే లక్ష్యం

నేను 7వ తరగతి చదువుతున్నాను. నా తండ్రి కొర్లయ్య ఫార్మాసిటీలో రోజు కూలీ. తల్లి దేముడమ్మ కూలి పనులు చేస్తుంది. రెండేళ్లుగా యోగా శిక్షకుడు ఆంజనేయులు వద్ద శిక్షణ పొందుతున్నా. జిల్లా స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించాను. త్వరలో అనంతపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాను. అక్కడ కూడ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికవ్వాలని తీవ్రంగా సాధన చేస్తున్నా. **– ఎం.తేజ, జెడ్పీ హైస్కూల్, ముత్యాలమ్మపాలెం**

ఎన్టీపీసీ సహకారంతో శిక్షణ



సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం సహకారంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పదేళ్లుగా యోగాలో శిక్షణ అందిస్తున్నాను. ఇప్పటి వరకు శిక్షణ పొందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో 36 మంది జాతీయ, రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. రానున్న ఏషియన్ క్రీడలే లక్ష్యంగా విద్యార్థులకు యోగాలో తర్ఫీదు అందిస్తున్నా. ఇందుకు సహకరిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు. **– సీహెచ్ ఆంజనేయులు, యోగా శిక్షకుడు**

క్లుప్తంగా


అప్పన్నకు వైభవంగా పౌర్ణమి తిరువీధి



బేడామండపంలో స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం తిరువీధి వైభవంగా జరిగింది. సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో జరగాల్సిన తిరువీధిని చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం ఆలయ బేడామండపంలో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేపచేశారు. బేడామండపంలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందించారు. పారాయణాలు చేశారు.

ఆదిత్యునికి అభిషేకాలు



సుజాతనగర్‌లో పూజలందుకుంటున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాతనగర్‌లోని సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామి వారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. స్వామిని అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది

పెందుర్తి: పినగాడి శ్రీరామ యూత్, పెందుర్తిలోని మారుతి నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో పినగాడిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. మొత్తం 97 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందించారు. వైద్యులు వెన్నెల హేమంత్, ఎ.రాజ్‌దీపక్, యూత్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయం మూత



వేంకటాద్రి వేంకటేశ్వరస్వామి గర్భాలయానికి తాళం వేస్తున్న అర్చకులు

పెందుర్తి: చంద్రగ్రహణం సందర్భంగా స్థానిక వేంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం కారణంగా ఆదివారం తాత్కాలికంగా మూసివేశారు. ఉదయం ఆరాధన అనంతరం గర్భాలయానికి తాళం వేశారు. సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ చేసిన తరువాత స్వామి గుడిని తెరుస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు.

నేడు అప్రంటిస్‌షిప్ మేళా

కంచరపాలెం: పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ చేయని అభ్యర్థుల కోసం కంచరపాలెంలోని విశాఖ ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో సోమవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2025 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జోన్–1 ఉప సంచాలకుడు ఆర్ వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్తాన్ షిప్‌యార్డ్, ఆలిండియా రేడియో, మేధా సర్వో డ్రైవ్స్, జయభేరి లిమిటెడ్ కంపెనీలతోపాటు 12కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

చిన్న వర్షానికే నిలిచిన నీరు



నెల్లిముక్కు ప్రధాన రహదారిలో పరిస్థితి

పెదగంట్యాడ:మండలంలో ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికే పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచి పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఎక్కడ నీటిలో జారి పడతామో అని భయం భయంగా ప్రయాణాలు సాగించారు.

'ఎరువుల సరఫరాపై అపోహలు వద్దు'



రావాడ గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు



టెక్కలిపాలెం రామాలయంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

పరవాడ: ఎరువుల సరఫరాపై రైతులకు ఎలాంటి అపోహలు వద్దని పరవాడ తహసీల్దార్ బి.నాగరాజు అన్నారు. ఎరువులపై రైతులకు అవగాహన కల్పించేందుకు మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో అధికారులు ఆదివారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభల్లో తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన ఎరువుల సరఫరాపై రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో రైతాంగానికి అవసరమైన ఎరువులు, యూరియా పుష్కలంగా ఉందని, కావలసిన రైతులు నేరుగా వెళ్లి ప్రభుత్వ ధరను చెల్లించి పొందవచ్చన్నారు. ఎరువుల పరిస్థితిపై రైతుల్లో భరోసా కల్పించారు. గ్రామ సభల్లో ఎంపీడీవో రమేష్‌నాయుడు, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, మండల వ్యవసాయాధికారి రమాదేవి, ఏఈవో మూర్తి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సబ్బవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని గొటివాడ, టెక్కలిపాలెం తదితర గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన యూరియా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. యూరియా దొరకదనే ఆందోళనతో రైతులు పంట కాలం మొత్తానికి అవసరమయ్యే యూరియాను ఒకేసారి తీసుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. మోతాదుకు మించి ఎరువుల వినియోగం మంచిదికాదన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో పద్మజ, వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తదితరులు పాల్గొని రైతులకు యూరియా లభ్యత, వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నీ

సబ్బవరం: తమతో ఐదేళ్ల పాటు చదువుకుని ఆకాల మరణం పొందిన స్నేహితుడి జ్ఞాపకార్థం మిత్రులు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. స్థానిక ప్రతిభ విద్యాలయంలో 2005–06 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిర్వహించిన ఈ టోర్నీని శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ బ్యాచ్‌కు చెందిన కర్రి శేషు 2022లో పాము కాటుకు గురై మరణించాడు. శేషు వాలీబాల్ ప్లేయర్ కావడంతో గత మూడేళ్లుగా ఆయన పేరిట ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. విజేతలకు నగదు బహుమతులను అందించి స్నేహితుడి గొప్పతనాన్ని ఏటా ఈ విధంగా గుర్తు చేసుకుంటున్నారు. ఈ పోటీల్లో పలు ప్రాంతాల నుంచి 11 జట్లు పాల్గొన్నాయి. ముఖ్య అతిథి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. ఆయన ఆర్థిక సాయంతో క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం అందించారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ రాజు

✦ పుట్ట గొడుగులు ప్రియం!



వానాకాలం వచ్చిందంటే చాలు పల్లెల్లో ప్రకృతి సిద్ధంగా లభించే పుట్టగొడుగులు ఎక్కడికక్కడ కనిపిస్తాయి. ఏటా జూన్‌లో వర్షాలు మొదలు కాగానే తొలి దశ పుట్టగొడుగులు లభిస్తాయి. ఈ ఏడాది జూన్, జూలైలో వర్షపాతం అంతగా నమోదు కాకపోవడంతో ఇవి పెద్దగా దొరకలేదు. ఇటీవల జోరుగా వానలు కురవడంతో రెండో దశ(దసరా పుట్టగొడుగులు)లో అక్కడక్కడా లభిస్తున్నాయి. గ్రామాల్లో మాంసాహారానికి సమానంగా భావించే ఈ పుట్టగొడుగుల ధరలు ప్రస్తుతం బజార్లలో ప్రియంగా ఉన్నాయి. రుచితోపాటు ప్రొటీన్లు, విటమిన్లు(ప్రధానంగా బి, డి), ఖనిజాలతోపాటు ఫైబర్ కూడా ఎక్కువ. వర్షాకాలంలో వచ్చే జ్వరాలు, ఇన్‌ఫెక్షన్ల నుంచి ఇవి రక్షిస్తాయని నమ్మకం. రానున్న వారం పది రోజుల్లో వర్షాలు జోరుగా కురిస్తే పల్లెతో పాటు పట్టణాల్లో కూడా పుట్టగొడుగుల కూర గుభాళించనుంది. **– పెందుర్తి**

ఉపాధ్యాయుల సమస్యలకు ఎన్‌టీఏ కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

పెందుర్తి: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. స్థానిక మహిళా ప్రగతి కేంద్రంలో ఆదివారం ఎన్‌టీఏ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణలకు ఉపాధ్యాయులు పూర్తి సహకారం అందించాలన్నారు. పలు అంశాలపై చర్చించారు. ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి హైమారావు, ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ రీ సర్వే తప్పులు సవరించాలని వినతి



తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందిస్తున్న వియ్యపు చిన్న

పరవాడ: మండలంలోని రావాడ గ్రామ పంచాయతీలో జరుగుతున్న రెవెన్యూ రీసర్వే తప్పులు తడకగా ఉందని, దీంతో రైతులు రెవెన్యూ పరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న ఆరోపించారు. ఈ మేరకు పరవాడ తహసీల్దార్ బి.నాగరాజును ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో రెవెన్యూ రీసర్వేలో సిబ్బంది రైతులకు చెందిన భూములను కాకుండా అదనంగా నమోదు చేయడం, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులతో రైతులను రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆక్షేపించారు. రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేయాలని, లేకుంటే సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. రీసర్వేలో జరిగిన తప్పుల్ని సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భరోసానిచ్చినట్లు చిన్న తెలిపారు.

ఎక్కడి చెత్త అక్కడే!



74వ వార్డు చైతన్య పాఠశాల ఎదురుగా ప్రధాన రహదారిపై చెత్త కుప్ప

పెదగంట్యాడ: మండలంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఓ పక్క వర్షాలతో ప్రజలు రోగాలు బారిన పడుతుంటే.. పారిశుద్ధ్యం పై అధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధి దయాల్‌నగర్ చైతన్య పాఠశాల ఎదురుగా ప్రధాన రహదారిలో నిత్యం చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చాన్ని రోజుల తరబడి తరలించక పోవడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు.

ఇరుకు రోడ్డుతో ట్రాఫిక్ ఇక్కట్లు



పరవాడ సంతబయలులో ట్రాఫిక్ సమస్య

పరవాడ: పరవాడ సంతబయలు ప్రాంతంలో ఇరుకు రోడ్డుతో తరచూ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలతో గ్రామీణ ప్రజలు నిత్యం సతమతమవుతున్నారు. వాడచీపురుపల్లి, యలమంచిలి ప్రాంతాల నుంచి అనకాపల్లి, గాజువాక ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు, ఆటోలు పరవాడ సంతబయలు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. పరవాడ సంతబయలు ప్రాంతం నుంచి గాజువాక, అనకాపల్లి వెళ్లే రోడ్డు మరీ ఇరుకుగా మారింది. ముందే ఇరుకు రోడ్డు ఆపై భారీ వాహనాల రాకపోకల వలన ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకొనే క్రమంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మంగళవారం రోజున సంతబయలులో జరిగే వారపు సంత కారణంగా ఇరుకు రోడ్డుపై వ్యాపారులు, గ్రామీణ ప్రజలు సాగిస్తున్న వ్యాపార కార్యకలాపాల వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాధారణ రోజుల్లో కూడా ఆర్టీసీ బస్సులు ఒకదానికొకటి తప్పించుకొనే క్రమంలో ట్రాఫిక్ ఇక్కట్లలో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వారపు సంత రోజున ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం అలాంటి చర్యలకు పోలీసులు దూరంగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలను సరిదిద్దే నాథుడే కనిపించట్లేదు. ఫలితంగా ప్రయాణికులు ట్రాఫిక్ వలయంలో చిక్కుకుని గంటల తరబడి సతమతమవుతున్నారు. దీని పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'బుద్ధిగా ప్రవర్తించి.. భవిష్యత్ బాగుచేసుకోండి'



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ దేముడుబాబు

పెందుర్తి: రౌడీ షీటర్లు బుద్ధి మార్చుకుని ప్రవర్తిస్తే వారి భవిష్యత్ బాగు చేసుకునే అవకాశం కల్పిస్తామని ఎస్ఐ దేముడుబాబు అన్నారు. సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని రౌడీ షీటర్లను హెచ్చరించారు. చెడు ప్రవర్తన వలన వారి కుటుంబాలు సమాజంలో చిన్న చూపునకు గురవుతాయన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని వివరించారు. వారికి పలు సూచనలు చేశారు. ఏఎస్ఐ కాశీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి



టిడ్కో గృహ సముదాయం వద్ద మాట్లాడుతున్న సీపీఐ సహాయ కార్యదర్శి సత్యనారాయణ

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి సరికాదని, వెంటనే హౌసింగ్ ప్రాజెక్టు వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళపాలెం టిడ్కో గృహ సముదాయం వద్ద ఏర్పాటు చేసిన లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల కిందట నిర్మించిన ఫ్లాట్లు కేటాయించినప్పటికీ కనీసం వసతులు కల్పించలేదన్నారు.